గురువులు

# సంఘం సంఘటితంగా పనిచేయటం ఎలా




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని రామ కృష్ణ సేవా సమితి(బాపట్ల) వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) రామ కృష్ణ సేవా సమితి(బాపట్ల) వారి వెబ్ సైట్: http://www.unworldliness.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో రామ కృష్ణ సేవా సమితి(బాపట్ల) వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## రామ కృష్ణ సేవా సమితి బాపట్ల వారి వెబ్ సైట్:

## http://www.unworldliness.org/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సంఘం

## సంఘటితంగా పనిచేయడం ఎలా?

మూలం
శ్రీవివేకానంద స్వామి

సంకలనం
కీ.శే. శ్రీ బి.యస్.ఆర్.ఆంజనేయులు
తెలుగు అనువాదం
ప్రొఫెసర్ పన్నాల శ్యామసుందర మూర్తి
అమిరపు నటరాజన్

శ్రీరామకృష్ణ సేవా సమితి,
బాపట్ల - 522 101

ప్రకాశకులు
శ్రీరామకృష్ణ సేవా సమితి,
బాపట్ల - 522 101

సర్వహక్కులూ ప్రకాశకులవి

(అద్వైతాశ్రమము, కలకత్తా వారిచే ప్రచురించబడిన వివేకానంద లేఖావళి, మరియు వివేకానంద సాహిత్య సర్వస్వము అను గ్రంథముల నుండి ఈ పుస్తకము కూర్చబడినది.)

ప్రథమ ముద్రణ: నవంబరు, 2003
ముద్రణలు సెప్టెంబరు 2011 వరకూ 32,000
ఆగష్టు 2012 3,000

ప్రతులకు
శ్రీరామకృష్ణ సేవా సమితి,
విజయలక్ష్మీపురం, బాపట్ల - 522 101.
e-mail: rksamithibapatla@gmail.com
website: www.unworldliness.org

# ప్రకాశకుల మనవి

వివేకానంద స్వామి అమెరికాలో ఉన్నప్పుడు ఒక రోజు, 'తాను సమ్మోహితుణ్ణి అయ్యాన'ని శిష్యురాలైన ఒక స్త్రీతో అన్నారు. అందుకు ఆమె, "అలా చేసిన స్త్రీ ఎవరు స్వామీ?' అని చమత్కరించింది. దానికి స్వామి పగలబడి నవ్వుతూ, "అది స్త్రీ కాదు. మీ సంఘమే నన్ను సమ్మోహితుణ్ణి చేసింది!" అని చెప్పారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సంఘటిత శక్తి ద్వారా ఎంత పని సాధించబడుతోందో ఆయన గమనించారు. సంఘటిత శక్తిని గురించిన ఆలోచనలు ఆయన హృదయాన్ని నింపివేశాయి. అమెరికాను విడిచే లోపలే ఆయన మనస్సులో ఒక సంఘాన్ని స్థాపించడం గురించిన మార్గం, సాధనాలు, పద్ధతులు అన్నీ స్పష్టంగా రూపుదిద్దుకున్నాయి.

వివేకానంద స్వామి సంఘం, సంఘటిత శక్తి గురించి వివిధ సందర్భాలలో చెప్పిన అమూల్యమైన విషయాలను శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు గారు సంకలనం చేశారు. దానిని సమితి 1984లో, ఆంగ్లంలో, "ఆర్గనైజేషన్ అండ్ ఆర్గనైజ్‌డ్ వర్క్" అనే పేరుతో ప్రచురించింది. జనబాహుళ్యానికి మరింత చేరువగా తేవడానికి ఈ పుస్తకాన్ని తెలుగులో ప్రచురిస్తున్నాము. ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించిన ప్రొఫెసర్ పన్నాల శ్యామసుందర మూర్తి గారికి, అమిరపు నటరాజన్ గారికి మా కృతజ్ఞతలు.

నవంబరు, 2003. ప్రకాశకులు

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సంఘం | 5 |
| 2. | నాయకుడు | 8 |
| 3. | కార్యకర్తలు | 9 |
| 4. | నిర్వహణ | 12 |
| 5. | లోటుపాట్లు | 14 |
| 6. | పనిలో శిక్షణ | 19 |
| 7. | అనుసరించవలసిన మార్గం | 23 |
| 8. | సామాన్య ప్రజానీకంతో పని చెయ్యడం | 26 |


ముఖచిత్ర వివరణ: తేనెతుట్టె సాంఘికజీవనానికి అత్యుత్తమ ఉదాహరణ. త్యాగంతో నిండిన నిస్వార్థజీవనానికి చిహ్నంగా నిలిచే తేనెటీగలు సంఘటితంగా ఎలా జీవించాలో, పని చెయ్యాలో మనకు చక్కగా చూపగలవు.

# 1. సంఘం

మనకు కలసికట్టుగా పనిచేసే సంఘం కావాలి.

ఋగ్వేద సంహితలో, "మీ అందరి మనస్సూ ఒకటే అగుగాక! మీ అందరి ఆలోచన ఒకటే అగుగాక! పూర్వ కాలంలో, దేవతలందరూ ఒకే మనస్సు కలిగి ఉండడం వల్లనే హవిస్సులను అందుకునే అర్హతను పొందగలిగారు" అని చెప్పబడింది. మనుష్యుల చేత దేవతలు పూజలు అందుకోవడానికి కారణం వారందరూ ఒకే మనస్సును కలిగి ఉండడమే. ఒకే మనస్సును, ఆలోచనను కలిగి ఉండడమే విజయవంతమైన సంఘజీవనంలోని రహస్యం.

ఈ రోజున మన దేశంలో అతి ముఖ్యంగా లోపించింది సంఘటిత శక్తి (అంటే కలసి పనిచేసే శక్తి). 'విధేయత'ను కలిగి ఉండడమే ఈ శక్తిలోని అసలు మర్మం.

మీరు చేపట్టిన పని ఎంత బాగా విజయం సాధిస్తుందన్నది ఒకరిపట్ల ఒకరికివున్న ప్రేమను బట్టి ఉంటుంది. ఒక సంఘంగా ఏర్పడి, అందరి శక్తులనూ పోగు చేసి, అందరి ఇష్టాలనూ సమన్వయం చేసి, వాటినన్నింటినీ ఏకాగ్రం చెయ్యడమే భవిష్యత్తులో ఒక గొప్ప భారతదేశాన్ని తయారు చెయ్యడానికి కావలసిన మూలసూత్రం.

మతసంబంధమైన ఒక క్రొత్త వర్గాన్ని తయారుచెయ్యడానికి కాక మనం చేపట్టిన కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించ డానికి, జమాఖర్చుల వ్యవహారాలను చక్కగా నడపడానికి, మన శక్తులను సంఘటితం చెయ్యాలి. ప్రజలను ఉర్రూతలూగించే ప్రచార ఉద్యమాన్ని చేపట్టాలి. మీరందరూ కలిసి, చర్చించి ఒక సంఘంగా ఏర్పడి పనిచెయ్యండి.

కలిసి పనిచెయ్యడమంటే చెయ్యవలసిన పనులను పంచు కోవడమే. అలా పంచుకున్న తర్వాత, ఎవరికి వారు తమకు అప్పగించిన పనులను సక్రమంగా నెరవేరిస్తే, అది ఒక ఆదర్శవంతమైన సమన్వయాన్ని రూపొందిస్తుంది.

ఫలితాల గురించి ఎంత శ్రద్ధ చూపిస్తామో అంతే శ్రద్ధను మనం పని చేసే పద్ధతి మీద కూడా పెట్టాలి. ఇదే విజయ రహస్యం.

"సంఘంలో ఎంతమంది మనుష్యులు ఉన్నారు? వాళ్ళు ధనవంతులా, పేదవారా?" ఇవేవీ ముఖ్యం కాదు. తమ ఆలోచనల్ని, మాటల్ని, చేతల్ని ఒకటిగా చేసుకున్న నలుగురు కలిస్తే చాలు, ఈ ప్రపంచాన్ని తల్లక్రిందులు చేయవచ్చు. ఈ దృఢవిశ్వాసాన్ని ఎల్లప్పుడూ కలిగి ఉండండి.

...కాబట్టి మీ సంఘం మీద మీకు అపారమైన అభిమానం ఉండాలి. అవిధేయతకు సంఘంలో స్థానమే లేదు. నిర్దాక్షిణ్యంగా దాన్ని అణచివేయండి. మాట వినని సభ్యులకు సంఘంలో ఎటువంటి స్థానం లేదు. వారిని బహిష్కరించి వెయ్యాల్సిందే. ఈ సంఘంలో విద్రోహులకు ఏ మాత్రమూ చోటు లేదు. సంఘంలో సభ్యులందరూ గాలిలాగా స్వేచ్ఛగానూ, చిన్న గడ్డిమొక్కలాగా విధేయతతోనూ ఉండాలి.

# 2. నాయకుడు

సమర్థంగా పని చెయ్యాలంటే బహుముఖప్రజ్ఞ గల బుద్ధిని కలిగి ఉండడం అత్యవసరం.

నాయకుడిగా వ్యవహరించడం చాలా కష్టమైన పని. అందుకోసం దాసులకు దాసుడై ఉండగలగాలి. వెయ్యి రకాల మనస్తత్త్వాలకు తన మనస్సులో చోటు చూపించగలిగే విశాల హృదయం ఉండాలి. అణువంతైనా స్వార్థం, అసూయ ఉండకూడదు. అప్పుడే నీవు నాయకుడవు కాగలుగుతావు.

ఎవరైతే ఒకణ్ణి ఎక్కువగానూ, ఒకణ్ణి తక్కువగానూ చూస్తాడో అతడు ఎప్పటికీ నాయకుడు కాలేడు. నాయకుడు కాదలచు కున్న వ్యక్తి హద్దులెరుగని ప్రేమను కలిగివుండాలి. పని మధ్యలో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అని లెక్కలు కడుతూ ఆగిపోకూడదు. ఇలా ఉండగలిగినవాడికి ఈ ప్రపంచమే పాదాక్రాంతమవుతుంది.

నాయకుడివి కాదలుచుకుంటే ముందు సేవకుడిగా ఉండడం నేర్చుకో! అదే అసలు రహస్యం. నీ మాటలు కరుకుగా ఉన్నా, నీ హృదయంలోని ప్రేమను ఇతరులు గుర్తించగలుగుతారు. మీ భాష ఎలావున్నా, దానిలో ప్రేమ నిండి వున్నప్పుడు ఇతరులు దాన్ని అప్రయత్నంగా అనుభూతి చెందగలుగుతారు.

# 3. కార్యకర్తలు

నిప్పులాంటి యువకులు మనకు ఇప్పుడు కావాలి. బుద్ధిమంతులూ, ధైర్యవంతులూ, మృత్యువు కోరల్లోకి పోవడానికి కూడా వెనుకాడని వారు, సముద్రాన్ని అడ్డంగా ఈదడానికి కూడా సిద్ధపడే యువకులు కావాలి. అటువంటి యువకులు, యువతులు మనకు వందలమంది కావాలి. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసమే మీరు తీవ్రంగా ప్రయత్నించండి. మనం పదిమందిమైనా, ఇద్దరమే అయినా లెక్క చేయనక్కర లేదు. కానీ ఉన్న కొద్దిమంది పరిపూర్ణమైన శీలాన్ని కలిగి ఉండాలి.

ధనంవల్ల, పేరుప్రతిష్టలవల్ల, విద్యవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మంచిశీలం మాత్రమే దుర్భేద్యమైన కష్టాల అడ్డుగోడల్ని పగులగొట్టుకుని ముందుకు చొచ్చుకుపోతుంది.

అత్యంత విశ్వాసపాత్రులైన కార్యకర్తలు కావాలి. అటువంటి వారితో పునాది వేసిన తర్వాత ఎవరు వచ్చి, ఎటువంటి కలకలం రేపినా భయపడవలసిన పని లేదు.

ఓ సోదరా! ఏ మంచిపనినైనా ఎటువంటి ఆటంకాలూ లేకుండా సాధించడం కుదరదు. అయితే చిట్టచివరిదాకా పట్టుదలతో శ్రమించే వారే విజయాన్ని సాధిస్తారు.

మంచి ఉద్దేశ్యాలు, నిజాయితీ, అంతులేని ప్రేమ ఈ ప్రపంచాన్నే జయించగలవని, నా ఈ అల్పజీవితంలో, అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. ఈ సుగుణాలు కలిగివున్న ఒక్క మనిషి లక్షలాది దుర్మార్గులనూ, నయవంచకులనూ ఎదుర్కొని, వారి కపట పన్నాగాలను నాశనం చెయ్యగలుగుతాడు.

ఎప్పటికీ మీ మనస్సులలో అహంకారానికి చోటివ్వకండి. ఎప్పటికీ మీ హృదయాలలో నుంచి ప్రేమను తొలగి పోనివ్వకండి.

తుదిశ్వాసను విడిచేటప్పుడైనా సరే, భయపడవద్దు. ఒక సింహంలాగా నిర్భయంగా, వీరత్వంతో పని చెయ్యండి. అదే సమయంలో ఒక పువ్వుకుండే మృదుత్వంతో మసలుకోండి.

అందరికన్నా తెలివితక్కువవాడు కూడా తన మనస్సుకు నచ్చిన పనిని సాధించగలుగుతాడు. కానీ అన్ని పనుల్నీ తనకు ఇష్టమైన వాటిగా మలచుకునేవాడే నిజంగా తెలివిగలవాడు. ఏ పనినీ అల్పమైనదని అనుకోవద్దు. ఈ ప్రపంచంలో ప్రతిదీ ఒక మర్రివిత్తనం లాంటిదే. అది పైకి ఒక ఆవగింజలాగా చిన్నదిగా కనిపించినా, బ్రహ్మాండమైన మర్రిచెట్టును తనలో ఇముడ్చుకుని ఉంటుంది. ఎవడైతే దీన్ని గమనించి, అన్ని పనులనూ గొప్ప పనులుగా మార్చివెయ్యడంలో విజయం సాధిస్తాడో వాడే నిజంగా బుద్ధిమంతుడు.

కొద్దికొద్దిగా కూడబెట్టినదే కొండంత అవుతుంది. ఒక గొప్ప పనిని చేస్తున్నప్పుడు, పునాదులు వేస్తున్నప్పుడు, రహదారుల్ని నిర్మిస్తున్నప్పుడు గొప్ప మానవశక్తి అవసరమవుతుంది. అటువంటప్పుడు ఒకరిద్దరు అసామాన్యులైన వ్యక్తులు మాత్రమే మౌనంగా, చడీచప్పుడూ లేకుండా, పెక్కు అవరోధాలకు ఎదురొడ్డి పని చేస్తారు. వారు చేసిన ఆ పనివల్ల వేలమందికి లాభం చేకూరినప్పుడు, గొప్పగా డప్పు వాయించి, దేశం యావత్తూ వారిని పొగడ్తలతో ముంచెత్తుతుంది. కానీ అప్పటికే ఆ యంత్రం పని చెయ్యడం మొదలుపెట్టింది కనుక, దాన్ని ఏ చిన్నపిల్లవాడైనా నడపగలుగుతాడు, ఎంత తెలివితక్కువవాడైనా దానికి మరికొంత ఉరవడిని కలిగించగలుగుతాడు.

ఒకటి రెండు గ్రామాలకు చేసిన సేవ, అక్కడ తయారైన పదిమంది, ఇరవైమంది కార్యకర్తలు, ఇవి చాలు. అవే ఎన్నటికీ నాశనం కాని బీజంగా ఏర్పడతాయి. వీటినుంచే క్రమేణా వేలకు వేలమంది ప్రజలు ప్రయోజనం పొందుతారు. మనకిప్పుడు వందలకొద్దీ నక్కలతో పని లేదు. సింహాలలాంటి వాళ్ళు ఆరుగురు చాలు. వారితోనే మహత్తరమైన పనుల్ని సాధించవచ్చు.

# 4. నిర్వహణ

భారతీయులమైన మనలో ఒక గొప్ప లోపం ఉంది. శాశ్వతమైన సంస్థల్ని ఏర్పాటు చేయలేకపోవడమే ఆ లోపం. దీనికి కారణాలు రెండు. మొదటిది ఇతరులతో మన అధికారాన్ని పంచుకోవడానికి ఎంతమాత్రమూ ఇష్టపడక పోవడం. రెండవది మనం పోయిన తర్వాత ఏమి జరుగుతుందనే విషయాన్ని ఎప్పుడూ ఆలోచించకపోవడం.

ఒక మనిషి చనిపోతే మరొకడు, ఒకడేమిటి, అవసరమైతే పదిమంది ఆ పని చెయ్యడానికి సిద్ధంగా ఉండాలి. మరొక విషయం, తాను చెయ్యాల్సిన పని మీద ఒక మనిషికి ఆసక్తిని రేకెత్తించలేకపోతే, ఆ పనిని అతడు హృదయపూర్వకంగా చెయ్యలేడు. సంస్థ యొక్క పనులపట్ల అందరికీ బాధ్యత ఉందనీ, దాని నిర్వహణలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ప్రతివొక్కరికీ ఉందనీ, అందరికీ అర్థమయ్యేలా తెలియజెప్పాలి. ఒకరి తర్వాత ఒకరు చొప్పున అందరికీ బాధ్యతాయుతమైన పదవుల్ని అప్పగించాలి. కానీ వారిని శ్రద్ధగా ఒక కంట కనిపెడుతూ, అవసరమైనప్పుడు వారిని నియంత్రించగలిగి ఉండాలి. కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు ఇది ఒక్కటే పద్ధతి. ఇటువంటి యంత్రాన్ని తయారుచేస్తే,

ఎవరు పోయినా, ఎవరు ఉన్నా అది తనంతట తానుగా నడుస్తూనే ఉంటుంది.

ప్రతివొక్కరికీ వారి మనస్సుకు నచ్చే పనిని అప్పగించాలి. సంఘాలను నిర్వహించడంలోని నైపుణ్యం ఇందులోనే ఇమిడి ఉంది. మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ పనిచేసినప్పుడే అత్యుత్తమంగా పనిచెయ్యగలుగుతాము.

నువ్వు ఏదైనా పని చేస్తానని మాట ఇచ్చినప్పుడు, కచ్చితంగా దాన్ని ముందు అనుకున్న సమయానికి చేసి తీరాలి. అలా చెయ్యలేకపోతే తోటివారికి నీ మీద నమ్మకం పోతుంది. డబ్బు వ్యవహారాల లెక్కలు తేల్చడంలో ఆలస్యం ఎంతమాత్రం పనికిరాదు.

ఏది ఎలా ఉన్నా వ్యాపారం వ్యాపారమే! మన ఆధీనంలో ఉన్న అన్ని విషయాలకూ సంబంధించిన జమాఖర్చుల పట్టీని దగ్గర ఉంచుకోవాలి. ఒక పనికి వాడవలసిన సొమ్మును ఎట్టి పరిస్థితులలోనూ "ఎట్టి పరిస్థితులలోనూ" వేరే పనికి వాడ కూడదు - దానివల్ల ఇంకొక క్షణంలో ఆకలితో మాడి, చావబోతున్నా సరే! వ్యాపారంలో నిజాయితీ అంటే ఇదే. అలుపెరుగని శక్తితో పనిచెయ్యి! మీరు ఏ పనిచేస్తున్నా ఆ సమయానికి దానినే అత్యుత్తమమైన ఆరాధనగా భావించి చెయ్యండి. అవసరమైతే నీ సోదరులైన కార్యకర్తల

అభిప్రాయాలను సరియైనవి అని ఒప్పుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండు. ఎల్లప్పుడూ స్నేహభావాన్ని పెంపొందించ డానికి ప్రయత్నించు. సంఘం విజయవంతంగా పనిచెయ్యడం లోని రహస్యమంతా ఇదే.

# 5. లోటుపాట్లు

సోదరా! మనం అన్నింటినీ వదిలించుకోగలం కానీ ఆ నికృష్టమైన అసూయను మాత్రం వదిలించుకోలేకుండా ఉన్నాం. అదే మన జాతి దౌర్భాగ్యం. ఇతరులను గురించి చెడుగా మాట్లాడడం, ఇతరుల గొప్పతనాన్ని చూసి ఓర్వలేక హృదయంలో దహించుకుపోవడం, గొప్పతనమంటే నాదేననీ, ఇతరులెవ్వరూ అటువంటి గొప్పతనాన్ని పొందకూడదనీ అనుకోవడం మన జాతి యొక్క చెడు లక్షణాలు.

మన ఉపనిషత్తులు ఎంత గొప్పవైనా కావచ్చు. ఋషుల నుంచి అందివచ్చిన వారసత్వాన్ని గురించి మనం ఎంతైనా గొప్పలు చెప్పుకోవచ్చు. కానీ మిగిలిన జాతులతో పోల్చి చూసినప్పుడు మనం చాలాచాలా బలహీనులమని చెప్పక తప్పదు. అన్నిటికంటే ముందు మన శారీరక బలహీనతను గురించి చెప్పుకోవాలి. మన బాధల్లో కనీసం మూడవవంతుకు

బలహీనమైన మన శరీరాలే కారణం. మనం బద్ధకస్తులం, పనిచెయ్యలేము, ఇతరులతో కలవలేము, ఒకరి నొకరు ప్రేమించలేము. మన స్వార్థానికి హద్దేలేదు. ఒకరి నొకరు ద్వేషించుకోకుండా, ఒకరిని చూసి ఒకరు ఈర్ష్యపడకుండా ముగ్గురు మనుష్యులు కలిసి పనిచెయ్యలేము. అంతులేని స్వార్థంతో, ఆశలన్నింటినీ వమ్ముచేసేంతగా ఛిన్నాభిన్నమై పోయి, పరస్పరం కుమ్ములాడుకునే పశువుల మందలాగా ఉంది మన ప్రస్తుత పరిస్థితి. భారతదేశంలో ముగ్గురు మనుష్యులు కలిసి ఐదు నిముషాలు పనిచెయ్యలేరు. ప్రతి ఒక్కరూ అధికారం కోసం పోరాడేవారే! దీనివల్ల కాలక్రమేణా సంస్థ కుప్పకూలి పోతుంది.

పోట్లాటలు, ఒకరినొకరు తిట్టుకోవడం మన జాతి లక్షణాలు. మనం సోమరిపోతులం, పనికిమాలినవాళ్ళం, అసభ్యంగా ప్రవర్తిస్తాం, అసూయాపరులం, పిరికిపందలం, పోట్లాట కోరులం - ఇవే మన లక్షణాలు. నా స్నేహితులు కాదలచిన వారు ఎవరైనా సరే, ఈ లక్షణాలను విడిచిపెట్టాలి.

అమితంగా స్వేచ్ఛను కోరుకునే పాశ్చాత్యదేశాలలోని ప్రజలు, ఒక సంఘంగా కలిసి పనిచేసేటప్పుడు గొప్ప విధేయతను కూడా ప్రదర్శిస్తారు. మనందరికీ, మన సొంత గొప్పలే ముఖ్యం. దానివల్ల ఏ పనీ జరుగదు. మహత్కార్యాలు సాధించాలన్న

తపన, క్రొత్త సాహసాలు చెయ్యాలన్న గొప్ప కోరిక, అంతులేని ధైర్యం, అద్భుతమైన శక్తి, అన్నిటికీ మించి పరిపూర్ణమైన విధేయత - ఈ లక్షణాలు మాత్రమే వ్యక్తిస్థాయిలోనూ, జాతీయస్థాయిలోనూ, పునరుజ్జీవనానికి దారి చూపగలవు. ఈ లక్షణాలు మనలో పూర్తిగా లోపించాయి.

అసలే మనకున్న శక్తి చాలా తక్కువ. ఏదైనా ఒక పనిని చేపట్టినప్పుడు, ఆ కొద్ది శక్తి అంతా చర్చలలోనే ఖర్చయి పోతుంది. ఇక పనిచెయ్యడానికి ఏమీ మిగలదు.

మనం ఏ పనీ చెయ్యం, కానీ పక్కవారు చేస్తుంటే వారిని వెక్కిరిస్తాం! ఈ దౌర్భాగ్యపు లక్షణమే మన జాతిని అన్ని విధాలా పతనమయ్యేలా చేసింది. దయ లేకపోవడం, నిస్సత్తువ అనే ఈ లక్షణాలే మన బాధలన్నింటికీ మూలం. కాబట్టి మీరు ఈ రెండు దుర్గుణాలనూ వదిలిపెట్టాలి. ఎవరైనా, ఏదైనా కార్య క్రమాన్ని చేపట్టినప్పుడు నీవు వారిని నిరుత్సాహపరచకూడదు! విమర్శించడాన్ని పూర్తిగా విడిచిపెట్టు! సరిగ్గా పని చేస్తున్నంత కాలం తోటివారందరికీ సహాయం చెయ్యి! వారిలో ఎవరైనా, ఎక్కడైనా తప్పు చేస్తున్నారని తోచినప్పుడు వారి పొరపాట్లను సుతిమెత్తగా వారితో చెప్పు. అన్ని అనర్థాలకూ మూలం ఒకరినొకరు విమర్శించుకోవడమే. సంస్థలను నేలమట్టం చేసే ముఖ్యకారణం అదే.

ఇతరులను గురించి, వారు లేనప్పుడు, చెడుగా మాట్లాడడ మనేది పాపమని తెలుసుకోండి. మీరు దాన్ని పూర్తిగా విడిచి పెట్టాలి. మనస్సులో రకరకాల ఆలోచనలు రావచ్చు. అంత మాత్రాన వాటిని బయటకు చెప్పడానికి ప్రయత్నిస్తే గోరంతలు కొండంతలవుతాయి. మర్చిపోగలిగితే అన్ని సమస్యలూ సమసిపోతాయి.

మీ అందరి కోసం నేను కొన్ని విషయాలు వ్రాస్తాను.

1) పక్షపాతబుద్ధే అన్ని చెడులకూ మూలకారణమని తెలుసుకోండి. అంటే మీరు ఒకరికన్న ఇంకొకరి మీద ఎక్కువ ప్రేమను చూపిస్తే, భవిష్యత్తులో మొలకెత్తబోయే సమస్యలకు బీజాలు నాటినట్టే.

2) ఎవరైనా మీతో సోదర సభ్యుల మీద చాడీలు చెప్పడానికి వస్తే అతడు చెప్పేది ఎంతమాత్రమూ వినిపించు కోవద్దు. అలాంటివి వినడం కూడా మహాపాపమే. అందులోనే భవిష్యత్తులో తలెత్తబోయే విభేదాలకు బీజాలు ఉంటాయి.

3) అందరి పొరపాట్లనూ భరించాలి. లక్షల తప్పులు చేసినా క్షమించండి. మీరు అందరినీ నిస్వార్థంగా ప్రేమిస్తే, క్రమక్రమంగా అందరూ ఒకరినొకరు ప్రేమించడం నేర్చుకుంటారు. తమ ప్రయోజనాలు మిగిలిన వారందరి ప్రయోజనాల మీద ఆధారపడి ఉన్నాయని వాళ్ళు చక్కగా అర్థం

చేసుకున్నప్పుడు ప్రతివొక్కరూ తమ అసూయాద్వేషాలను విడిచిపెడతారు.

మొత్తం ఉద్యమం యొక్క బాధ్యతను మీరే వహించండి. అయితే ఒక నాయకుడిగా కాక ఒక సేవకుడిగా మాత్రమే సుమా! మీరు నాయకుడిలాగా వ్యవహరిస్తున్నట్లు ఏ మాత్రం ఇతరులకు తోచినా అది అసూయను రగిలించి సమస్తాన్నీ నాశనం చేస్తుంది.

నీ సోదరుల మీద పెత్తనం చెలాయించాలని చూడకు. వారికి సేవ చెయ్యి. జంతువుల మాదిరిగా ఆధిపత్యం కోసం పోరాడుకోవడం వల్లనే ఈ జీవితసాగరంలో అనేక మహానౌకలు (సంస్థలు) మునిగిపోయాయి. అందుచేత ఆ అధికార వ్యామోహం నీ దరిచేరకుండా జాగ్రత్త వహించు. అంటే కడపటి శ్వాస విడిచేవరకూ నిస్వార్థంగా ఉండి పని చెయ్యి.

అందరికీ సేవకుడిగా ఉండు. లేశమాత్రమైనా అధికారాన్ని చూపకు. అదే అసూయను రగిల్చి అన్నింటినీ నాశనం చేస్తుంది. నిన్ను నువ్వే నాయకుడిగా చెప్పుకుంటే నీకు సహాయ పడడానికి ఎవ్వరూ ముందుకు రారు. మొదట అహంకారాన్ని చంపుకో! అప్పుడే విజయం సాధిస్తావు.

# 6. పనిలో శిక్షణ

ముందుగానే పెద్దపెద్ద ప్రణాళికలు వెయ్యవద్దు. నెమ్మదిగా పని మొదలుపెట్టి, మీరు ఎంతవరకూ చెయ్యగలరో చూసుకుని, క్రమక్రమంగా మీ కార్యక్రమాలను పెంచుతూ సాగిపోండి. శాంతిసమన్వయాలతో కార్యక్రమాలను నెమ్మదిగా పెరగ నివ్వండి. 'రోమ్ నగరాన్ని ఒక్క రోజులో నిర్మించలేదు' సుమా!

ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఏయే పనులు, ఎంతవరకూ సాధ్యమో వాటినే చెయ్యండి. ఆపై త్రోవ దానంతట అదే సుగమం అవుతుంది.

అతి తక్కువ పెట్టుబడితో, శాశ్వతంగా నిలిచి వుండే మంచి పనులుచెయ్యడం ఎలా సాధ్యమో మనం తెలుసుకోవాలి.

ఇప్పుడు మీరంతట మీరు ఆలోచించి క్రొత్త భావాలతో, సొంత ఆలోచనలతో ముందుకు రావాలి. లేకపోతే సమస్తం ముక్కచెక్కలై నేలకూలుతుంది. ఉదాహరణకు, మీరు సమావేశమై, "మనకున్న కొద్ది వనరులతో అత్యుత్తమమైన, శాశ్వతమైన ఫలితాల్ని ఎలా సాధించగలం?" అని ఆలోచించ వచ్చు.

నేను చెప్పే అతి ముఖ్యమైన విషయం ఇది. మీరు కోరుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్టడానికి అందుకు తగిన స్థాయిలోనే పనిని కూడా ప్రారంభించాలి.

(నూతిలో కప్పలలాగా ఉండకుండా) సంకుచిత భావాల చీకటి మూలలలో నుంచి బయటపడినప్పుడే మన హృదయం లో ఉన్నత ఆదర్శాలు, భావాలు చోటు చేసుకోగలుగుతాయి అన్ని మహత్కార్యాలు నెమ్మదినెమ్మదిగానే సాధించబడతాయి.

మోసం, దగాలతో ఏ గొప్ప పనినైనా చెయ్యడం సాధ్యం కాదు. ప్రేమ ద్వారా, సత్యమార్గాన్ని అనుసరించాలన్న బలమైన కోరిక ద్వారా, అపరిమితమైన శక్తితోనూ, అన్ని పనులూ సాధించబడతాయి. "తత్ కురు పౌరుషమ్!" "కాబట్టి మీ పౌరుషాన్ని ప్రదర్శించండి!"

మీ మనస్సులో మాటను (క్రొత్త ఆలోచనను) ఊరకనే బయటపెట్టవద్దు. దానివల్ల తప్పక మంచి జరుగుతుందని అనుకున్నప్పుడే చెప్పండి. మీ బద్ధశత్రువుతోనైనా సరే మంచిగా, మృదువుగా, నొప్పి కలిగించకుండా ఉండే భాషను ఉపయోగించి మాట్లాడండి. అన్ని పనులు క్రమక్రమంగా జరుగుతాయి.

మనం వేసుకున్న ప్రణాళికల్ని రహస్యంగా ఉంచకపోతే పని పాడవుతుంది....

...ఒక పని ఎంత బాగా జరిగిందన్నది దాని ఫలితాలవల్ల మాత్రమే తెలుస్తుంది.

డబ్బు వ్యవహారాలలో అతి పవిత్రంగా ఉండాలి. మీకు విశ్వాసం, నిజాయితీ, భక్తి ఉన్నంతకాలం సర్వత్రా అభివృద్ధిని సాధించగలరు.

మనిషే డబ్బును సృష్టించాడు కదా! డబ్బు మనిషిని తయారు చెయ్యగా మీరు ఎక్కడైనా చూశారా? మీ ఆలోచనల్ని, మాటల్ని ఒకటిగా చేయగలిగితే – నేను మరొక్కసారి చెపుతున్నాను – మీ మాటల్ని, చేతల్ని సంపూర్ణంగా ఒకటిగా చేయగలిగితే, మీ కాళ్ళ ముందుకు డబ్బు నీళ్ళలాగా ధారాళంగా ప్రవహిస్తుంది.

ప్రశాంతంగా, మౌనంగా, పట్టువదలకుండా పనిచెయ్యాలి. వార్తాపత్రికల కెక్కడం, తద్వారా పేరుప్రతిష్ఠలు పొందాలను కోవడం ఎంతమాత్రం పనికిరావు. దీన్ని ఎల్లప్పుడూ మనస్సులో పెట్టుకోండి!

అధికారం కోసం వెంపర్లాట, అసూయ – ఈ రెండు విషయాల గురించి జాగ్రత్తగా ఉండండి. "మీ మీద మీకు విశ్వాసం" – దీన్ని అన్ని వేళలా పెంపొందించుకోండి.

"శ్రేయాంసి బహు విఘ్నాని" "అనేక విఘ్నాలను ఎదుర్కోవడం ద్వారానే శ్రేయోదాయకమైన మంచిపనులన్నీ సాధించబడతాయి." ఇది ప్రకృతి సహజమైన విషయం. కాబట్టి

మీ మనఃస్థితి పూర్తిగా నిశ్చలంగా ఉండాలి, అల్పులైనవారు మీ గురించి ఏమంటున్నా సరే ఎంతమాత్రం పట్టించుకోవద్దు. కళ్ళు రెండు, చెవులు రెండు, నోరు మాత్రం ఒకటే - ఈ విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి!

వ్యతిరేకమైన భావాలు, నాశనాన్ని కొనితెచ్చే మాటలు, ఊరకనే చేసే విమర్శలు - అన్నీ త్వరలోనే తొలగిపోతాయనీ; ఔను, ఔను అనే ఆశాజనక భావాలు, తప్పక చేద్దామని రూఢిగా చెప్పే మాటలు, నిర్మాణాత్మకమైన పలుకులు మాత్రమే ఎప్పటికీ నిలిచివుంటాయనీ; తెలుసుకోండి.

ఇప్పుడు మనం ఏమి చేయబోతున్నామోనని ప్రపంచం మనల్ని కన్నార్పకుండా చూస్తోంది. మన యొక్క ప్రతి పనినీ, ప్రతి పలుకునీ ప్రపంచం వేయికళ్ళతో గమనిస్తోంది. దీన్ని ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకుని పనిచెయ్యండి.

అవహేళన, ప్రతిఘటన, అంగీకారం - ప్రతి పనీ ఈ మూడు దశల ద్వారా పోవలసిందే. ఏ వ్యక్తి అయితే తానున్న కాలానికంటే సుదూరమైన భవిష్యత్తులోకి తొంగి చూడగలిగి, దానికి తగినట్టుగా ఆలోచించి, పని చెయ్యాలనుకుంటాడో అతణ్ణి సమాజం అపార్థం చేసుకోవడం మనకు తరచూ కనిపిస్తూనే ఉంటుంది. దీనిలో ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు.

ఎవరిమీదా ఆధారపడకుండా నీవొక్కడివే పనిని కొనసాగించు. "వండి వార్చిన తర్వాత తినడానికి వందలమంది తయారవుతారు!" కాబట్టి జాగ్రత్తగా పని చెయ్యి.

అన్నీ సక్రమంగా జరుగుతాయనే ఆశాజనక దృక్పథాన్ని అలవరచుకో. ఇతరులను విమర్శించవద్దు. నీవు ఇచ్చే సందేశాన్ని ఇవ్వు, నీవు నేర్పించదలచుకున్న దాన్ని నేర్పించు. అంతటితో ఆగిపో!

# 7. అనుసరించవలసిన మార్గం

ఒక జాతిగా మనం మన వ్యక్తిత్వాన్ని కోల్పోయాము. భారత దేశంలో అన్ని అనర్థాలకూ ఇదే కారణం. పోయిన వ్యక్తిత్వాన్ని తిరిగి దేశానికి ఇచ్చి, సామాన్య ప్రజానీకాన్ని ఉద్ధరించాలి ఇదే మనం చెయ్యవలసిన పని.

గ్రామగ్రామానికీ, ఇంటింటికీ తిరగండి! (ఉన్నతమైన ఆధ్యాత్మిక భావాలతోపాటు ప్రాపంచిక విద్యను కూడా నేర్పండి.) అప్పుడే మీరు సక్రమంగా పని చేసినట్టు.

శక్తి (స్త్రీశక్తి) లేకుండా ఈ ప్రపంచ పునరుజ్జీవనం సాధ్యం కాదు. మన దేశం అన్ని దేశాలకన్నా వెనుకబడి ఉండడానికి,

బలహీనంగా ఉండడానికి కారణం ఏమిటి? శక్తిని (స్త్రీలను) అగౌరవంగా చూడడమే దీనికి కారణం.

స్త్రీల పరిస్థితిని మెరుగుపరచనంతవరకూ ప్రపంచ సంక్షేమం సాధ్యం కాదు. పక్షికి ఒక రెక్క మీదే ఎగరడం సాధ్యం కాదు కదా!

నువ్వు ఏ మంచి పనిని మొదలు పెట్టినా, కొందరు మనుష్యులు దాన్ని మెచ్చుకుంటే, కొందరు దాన్ని తప్పు పడతారు. కాబట్టి నువ్వు చేసేది చేస్తూ ఉండు. ఎవరికైనా సమాధానం చెప్పవలసిన అవసరం నీకు ఏముంది?

ఏ సామాజిక వ్యవస్థలోని తప్పులనైనా ఎత్తి చూపడం చాలా సులభం. ఇంచుమించు అన్నీ లోపాలతో ఉండేవే. కానీ ఒక వ్యక్తి ఏ సమాజంలో ఉన్నా, అతడికి తన లోపాలను అధిగమించేందుకు సహాయపడేవాడే నిజంగా మానవాళికి సేవ చేసేవాడు. ఎప్పుడైతే వ్యక్తి ఉద్ధరించబడతాడో అప్పుడు ఆ దేశం, సమాజం వాటంతట అవే ఉద్ధరించబడతాయి.

పశ్చిమ దేశాలకూ, తూర్పు దేశాలకూ ఉన్న తేడా అంతా ఇదే - వాటిని దేశాలు అని చెప్పుకోవచ్చు కానీ మనవి దేశాలు కావు. ఎందుకంటే, నాగరికత, విద్య అక్కడ సామాన్య ప్రజానీకంలోకి కూడా చొచ్చుకొని పోయాయి. భారత దేశంలోనూ, అమెరికాలోనూ ఉన్నత తరగతుల ప్రజలు ఒకే

రకంగా ఉంటారు. కానీ అక్కడి, ఇక్కడి బడుగువర్గాలను పోల్చినప్పుడు వారి మధ్య తేడా అనంతం. మన మహాత్ములలో ఎవరైనా మరణిస్తే ఇంకొకరు తయారుకావడానికి మనం శతాబ్దాల తరబడి వేచి కూర్చోవలసి వస్తుంది. కానీ వారు ఒక గొప్పవాడు పోతే మరొకణ్ణి వెనువెంటనే తయారుచెయ్యగలుగు తున్నారు. ఎక్కువమంది జనాభా విద్యాధికులై ఉండడం వల్ల ఎక్కువమంది గొప్పవారు తయారయ్యే అవకాశాలు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. మనకు అటువంటి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి.

కాలం గడిచిపోతోంది. మన శక్తియుక్తులన్నీ పనికిమాలిన కబుర్లతో వృథా అయిపోతున్నాయి. లెండి! మేల్కోండి! ఈ చిన్నచిన్న విషయాల్ని, చిన్నచిన్న విభేదాల్ని, అల్పసిద్ధాంతాల మీద తగాదాల్ని పక్కన పెట్టండి. క్షణక్షణానికీ మరింతగా (అధః పాతాళానికి) జారిపోతున్న లక్షలాదిమంది మీ కట్టెదుట ఉన్నారు. చూడండి! వారికి సేవ చెయ్యడమే అన్నింటిలోకీ అత్యుత్తమమైన పని.

## 8. సామాన్య ప్రజానీకంతో పని చెయ్యడం

మీరు మీ శరీరాన్ని, మనస్సుని, వాక్కుని ప్రపంచ సంక్షేమా నికి (బహుజన హితాయ) ధారపొయ్యాలి. మీరు, "మాతృదేవో భవ, పితృదేవో భవ – మీ తల్లిని దేవునిగా చూడండి, తండ్రిని దేవునిగా చూడండి" అని చదువుకున్నారు. కానీ నేను చెప్పేదేమంటే, "దరిద్రదేవో భవ! మూర్ఖదేవో భవ! – పేదల్ని, నిరక్షరాస్యుల్ని, అజ్ఞానుల్ని, రోగుల్ని మీ దేవుళ్ళుగా చేసుకోండి." వీరికి సేవ చెయ్యడమే అత్యున్నతమైన మత ధర్మమని తెలుసుకోండి.

సామాన్య ప్రజలలో విద్యాబుద్ధులు ఎంతగా వ్యాపించాయో అంతగా ఆ దేశం పురోభివృద్ధి సాధించిందని చెప్పవచ్చు.

భారతదేశంలోనే కాక బయటి దేశాలలో వికసించిన ఉదాత్త భావాలన్నింటినీ కూడా మన దేశంలోని బడుగువర్గాల, పేద ప్రజల వాకిటి ముందుకు తేవాలన్నదే నా ఆకాంక్ష. ఆ భావాలను తెలుసుకున్న తర్వాత వారిని సొంతంగా ఆలోచించు కోనివ్వండి.... "ఆలోచించడానికి, పనిచేయడానికి స్వేచ్ఛని కలిగివుండడమే ఉత్తమ జీవనానికి, పురోభివృద్ధికి, సంక్షేమానికి కావలసిన పరిస్థితి". ఎక్కడైతే ఆ స్వేచ్ఛ ఉండదో, ఆ వ్యక్తి, ఆ జాతి, ఆ దేశం నాశనం కావలసిందే.

మన దేశప్రజలు అని నిజంగా చెప్పదగినవారు గుడిసెలలో నివసిస్తున్నారు. వాళ్ళు తాము మనుష్యులమన్న విషయాన్ని, తమ వ్యక్తిత్వాన్ని మరచిపోయారు. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, అందరూ వారిని అణచివేసిన వారే. అందువల్ల, జేబులో తగినంత ధనం ఉన్నవాడెవడు ఎదురైనా సరే, వాడి కాళ్ళ క్రింద నలగడానికే తాము పుట్టామని మన బడుగువర్గాల ప్రజలు భావించడం మొదలుపెట్టారు. వారు కోల్పోయిన వ్యక్తిత్వాన్ని వారికి తిరిగి ఇవ్వాలి. వారికి విద్య నేర్పాలి.

నేనొక అలౌకికవాదిని కాను. వేదాంతిని కాను. ఋషిని అంతకంటే కాను. నేనొక పేదవాణ్ణి! పేదలను ప్రేమిస్తాను! ....మీరు కూడా పేదల గురించే ఆలోచించండి. వారి కోసమే పనిచెయ్యండి, వారి కోసం నిరంతరం ప్రార్థించండి. దేవుడే మీకు త్రోవ చూపిస్తాడు. పేదలకోసం ఎవరి హృదయం ద్రవిస్తుందో అతణ్ణే నేను మహాత్ముడని అంటాను. లేకపోతే అతడు దురాత్ముడే. ....నా భావాలను చెప్పలేనంత నిండుగా ఉంది నా హృదయం. నీకది తెలుసు. లక్షలాది ప్రజలు ఆకలితో, అజ్ఞానంతో జీవిస్తున్నంత కాలం, వారి కష్టార్జితంతో విద్యనేర్చి, వారి గోడును కొంచెమైనా పట్టించుకోని ప్రతి ఒక్కణ్ణీ నేను దేశద్రోహి అంటాను. ఆకలిగొన్న జంతువులలాగా ఉన్న ఆ

ఇరవై కోట్లమంది పేద ప్రజల బాగు కోసం ఏమీ చేయకుండా, ఆ పేదల్నే పీల్చిపిప్పిచేయడం ద్వారా తమ ధనాన్ని మొత్తం సంపాదించి, సోకు చేసుకుని తిరిగే వారందరినీ దుర్మార్గులని నేనంటాను.

భారతదేశంలోని లక్షలాది పేదప్రజలకోసం నిజంగా విలపించేవారు ఎందరు? మనం మనుష్యులమేనా? వారి బ్రతుకుతెరువు కోసం, వారి పరిస్థితి మెరుగుపరచడానికి మనమేమి చేస్తున్నాం? వారిని కనీసం మన దగ్గరికి కూడా రానివ్వం! మనం అసలు మనుష్యులమేనా?

బడుగువర్గాల న్యాయపరమైన హక్కులు వారికి దక్కేలా చేయడంలోనే ఉన్నతవర్గాల సంక్షేమం ఇమిడి ఉన్నది.

నిప్పురవ్వలలాంటి చురుకైన యువకులకు శిక్షణ ఇచ్చి, ఒక బృందాన్ని తయారు చెయ్యండి. మీలోని ఉత్తేజాన్ని వారికి కూడా అందివ్వండి. క్రమంగా సంఘాన్ని విస్తరింపజెయ్యండి. దాని పరిధిని ఇంకా ఇంకా పెరగనివ్వండి. (సమాజోద్ధరణ గురించి) పుంఖానుపుంఖాలుగా వ్రాసిన అర్థం లేని వ్రాతల కన్నా, ఊకదంపుడు ఉపన్యాసాల కన్నా, నిజమైన పని అది అణువంతైనా కావచ్చు - అదే ఎంతో మెరుగు.

ప్రస్తుతానికి సేవాకార్యక్రమాల విభాగం మీదే మీ పూర్తి శ్రద్ధను ఉంచండి. దానిని మరింత ఉపయోగకరంగా తీర్చి

దిద్దేందుకు హృదయపూర్వకంగా ఆత్మార్పణ బుద్ధితో పని చెయ్యండి. కొందరు యువకులను కూడగట్టి, ఇంటింటికీ తిరిగి డబ్బు, పాతబట్టలు, బియ్యం, తినుబండారాలు మొదలైన వాటిని సేకరించేలా చెయ్యండి. వాటిని పంచిపెట్టండి. అదే నిజమైన సేవ! అప్పుడే ప్రజలకు మీ మీద నమ్మకం కలిగి మీరు చెప్పినది వింటారు.

అనాథలు, పేదలు, నిరక్షరాస్యులైన సన్నకారు రైతులు, శ్రామిక వర్గాలు - వీరి కోసమే మన ఉద్యమం. వారికి చెయ్యవలసినదంతా చేసిన తర్వాతనే, ఏమైనా సమయం మిగిలితే, అప్పుడు (ధనికులైన) సంస్కారవంతుల గురించి ఆలోచించవచ్చు. ప్రేమతో మాత్రమే కార్మికుల్ని, కర్షకుల్ని మన వారిగా చేసుకోగలం.

కార్మిక, కర్షక వర్గాల పిల్లలకు ప్రాథమిక విద్యను బోధించి, వారి మనస్సులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చొప్పించండి. ఈ రకంగా తయారైన యువకులు గ్రామాలలో అభివృద్ధి కోసం పని చెయ్యగలుగుతారు. ప్రతి గ్రామంలోని ప్రజలు తమంతటతామే డబ్బు సమకూర్చుకుని ఈ యువకుల్ని తమతమ గ్రామాలకు సేవ చేసేందుకు ఉపయోగించుకుంటారు. "ఉద్ధరేత్ ఆత్మనాత్మానం" ఎవరికి వారే స్వయంకృషితో తమకు తాము సహాయం చేసుకోవడానికి మనం తోడ్పడాలి. ...వారు

తమ పరిస్థితిని అర్థం చేసుకుని, తమకు తామే సహాయం చేసుకుని, అభివృద్ధిని సాధించవలసిన అవసరాన్ని గుర్తిస్తారో, అప్పుడు మీ కృషి సరైన మార్గంలో సత్ఫలితాలను సాధిస్తోందని తెలుసుకోవచ్చు. ...ఆ పైన కార్మిక, కర్షక వర్గాలను తమ సమస్యలను తామే గుర్తించి, అర్థం చేసుకుని, తమ స్వప్రయత్నంతో వాటిని పరిష్కరించుకోనివ్వండి.

ప్రజలు తమ కాళ్ళమీద తాము నిలబడేందుకు తగిన శిక్షణ నివ్వకపోతే, ప్రపంచంలోని మొత్తం సంపదను తెచ్చి కుమ్మరించినా, అది భారతదేశంలోని ఒక చిన్న గ్రామం యొక్క సమస్యలను కూడా తీర్చలేదు. మనం ప్రధానంగా విద్య నేర్పించడానికి కృషి చెయ్యాలి. ఆ విద్య నీతిని బోధించేదీ, బుద్ధిని పెంపొందించేదీ అయి ఉండాలి.

వివిధ ప్రపంచ దేశాలలో ఏమి జరిగిందో, ఇప్పుడు ఏమి జరుగుతోందో, ఈ ప్రపంచం ఏమిటో - మొదలైన విషయాలు తెలియజెప్పి వారి దృష్టి విశాలమయ్యేందుకు ప్రయత్నించండి. భారతదేశంలో లక్షలాది మంది పేదలు, నిరక్షరాస్యులు ఉన్నారు. సాయంత్రం కానీ, మధ్యాహ్నం కానీ, ఏ సమయంలోనైనా సరే, ఇంటింటికీ తిరుగుతూ వాళ్ళకు విశాలదృక్పథం కలిగించేందుకు కృషి చెయ్యండి. పుస్తకాలతో

పని లేదు. నోటిమాట ద్వారానే విద్య నేర్పించండి. నెమ్మదినెమ్మదిగా క్రొత్త కేంద్రాలను ప్రారంభించండి.

విద్య అంటే ఏమిటి? పుస్తకాల నుంచి నేర్చుకున్నదా? కాదు. చాలా విషయాలు తెలియడమా? అది కూడా కాదు. ఏ శిక్షణ ద్వారా సంకల్పశక్తి యొక్క ప్రవాహాన్ని, అది పనిచేసే పద్ధతిని స్వాధీనంలోకి తెచ్చుకుని, తద్వారా మనిషి తన కాళ్ళ మీద తాను నిలబడగలడో దానినే విద్య అంటారు.

పర్వతం మహమ్మదు గారి దగ్గరకు రాకపోతే మహమ్మదుగారే పర్వతం వద్దకు వెళ్ళాలి. విద్య కోసం పేదలు రాలేకపోతే, విద్యయే పేదల్ని చేరుకోవాలి. వారు నాగలిపట్టి ఉన్నా, పరిశ్రమలో ఉన్నా, ఎక్కడ ఉన్నా సరే!

తమ పరిస్థితిని ఎలా మెరుగుపరచుకోవాలో వారికి బోధించండి! మన శాస్త్రాలలోని సూక్ష్మమైన సత్యాలను సులభమైన భాషతో, ప్రజారంజకమైన పద్ధతిలో వారికి అందించి, వాటిని అర్థం చేసుకునేలా చెయ్యండి. మతధర్మ విషయాల మీద బ్రాహ్మణులకు ఎంత హక్కు ఉందో అంత హక్కు తమకు కూడా ఉందన్న విషయాన్ని వారి మనస్సులలో ముద్రించండి. అంతేకాక సులభమైన మాటలలో జీవితావసరాల గురించి, వ్యాపారాన్ని గురించి, వ్యవసాయాన్ని గురించి వారికి బోధించండి.

మన పూర్వీకులు అందించిన ప్రణాళికనే మనం అనుసరించాలి. సామాన్య ప్రజానీకంలోకి అన్ని రకాల ఉన్నతభావాలనూ చొప్పించాలి. వారిని నెమ్మదిగా లేవనెత్తి, సమానత్వాన్ని కలిగించాలి. మతం ద్వారానే శాస్త్రవిజ్ఞానాన్ని కూడా బోధించాలి. భౌగోళికశాస్త్రం మొదలైన విషయాల మీద ముఖ్యంగా చరిత్ర గురించి - నోటి పాఠాల ద్వారా విద్యనందించాలి.

నమ్మకాన్ని కలిగి ఉండేవారు ధీరులు. వాళ్ళు అద్భుతమైన శక్తిని ప్రదర్శించగలుగుతారు. వారి ముందు ప్రపంచం దాసోహమని అంటుంది. "పేదల పరిస్థితిని అర్థం చేసుకుని సేవ చెయ్యాలి." "మానవుడే దేవుడు - అతడే నారాయణుడు." "ఆత్మకు స్త్రీ-పురుష భేదం, బ్రాహ్మణ క్షత్రియ భేదం మొదలైనవి ఉన్నాయా?" "సృష్టికర్త నుంచీ గడ్డిపోచ వరకూ అందరూ నారాయణ స్వరూపమే!"

మనిషి యొక్క దివ్యత్వాన్ని మరింతగా వ్యక్తపరచడానికి సహకరించే ప్రతి పని మంచిదే. ఆ దివ్యత్వాన్ని మరుగుపరచే ప్రతి పని చెడ్డదే. ఇతరులకు తమ దివ్యత్వాన్ని వ్యక్తీకరించేందుకు సహాయపడడమే మనలోని దివ్యత్వాన్ని వ్యక్తీకరించేందుకు ఏకైక మార్గం.

# 37. హనుమాన్ చాలీసా

తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను పదేపదే పఠించడం హనుమంతుడి గుణధ్యానం చెయ్యడానికి ఒక చక్కని మార్గం.

## ప్రార్థన

శ్రీ గురుచరణ సరోజరజ నిజమన ముకుర సుధారి
వరణౌరఘువర విమల యశ జోదాయక ఫలచారి
బుద్ధిహీన తను జాని కే సుమిరౌ పవన కుమార్
బలబుద్ధి విద్యా దేహు మోహి హరహుకలేశ వికార్

## చాలీసా

01. జై హనుమాన జ్ఞానగుణసాగర
జై కపీశ తిహులోక ఉజాగర
02. రామదూత అతులిత బలధామా
అంజనిపుత్ర పవనసుతనామా
03. మహావీర విక్రమ బజరంగీ
కుమతినివార సుమతికే సంగీ
04. కంచనవరణ విరాజ సువేశా
కానన కుండల కుంచిత కేశా
05. హాథవజ్ర ఔర్ ధ్వజా విరాజై
కాంధే మూంజ జనేవూసాజై
06. శంకరసువన కేసరీనందన
తేజప్రతాప మహాజగవందన

# హనుమాన్ చాలీసా అర్థం

ప్రార్థన (తులసీదాసు ఇలా చెపుతున్నాడు): శ్రీగురుదేవుల చరణ కమలాలలోని కాంతితో నా మనస్సు అనే అద్దాన్ని శుభ్రం చేసుకుంటాను. మనిషి తన జీవితంలో కోరుకోదగిన ధర్మం, అర్థం (ధనం), కామం (కోరికలు), మోక్షం అనే నాలుగు ఫలాలను అందించే శ్రీరామచంద్రుడి యొక్క మచ్చలేని కీర్తిని వర్ణించి చెపుతాను.

అజ్ఞానం వలన ఈ శరీరం (జన్మ) కలిగింది. ఈ విషయాన్ని చక్కగా అర్థం చేసుకుని పవనకుమారుడైన హనుమంతుణ్ణి స్మరిస్తాను. అతడు నాకు బలాన్ని, బుద్ధిని, విద్యను ఇవ్వడమే కాక నాలో కోరికల వలన కలిగే కష్టాలను, వికారాలను తొలగించు గాక!

01. ఇంద్రుడు వజ్రాయుధంతో నిన్ను కొట్టినప్పుడు నీ దవడమీద సొట్టపడి నీకు హనుమంతుడు అనే పేరు వచ్చింది! జ్ఞానానికి, సుగుణాలకు నువ్వు సముద్రం లాంటివాడివి! మూడులోకాలకూ నీవు వెలుగునిస్తావు! నీకు జయమగుగాక!

02. నీవు రాముడి దూతవు! నీ బలానికి సాటిలేదు. అంజనీదేవి కుమారుడివి! వాయుదేవుడి అంశతో పుట్టావు కాబట్టి పవనకుమారుడనే పేరు నీకు వచ్చింది!

03. ఓ మహావీరా! పరాక్రమానికి రూపం నీవే! నీవు వజ్రం లాంటి గట్టి శరీరం కలవాడివి! చెడుబుద్ధిని పోగొడతావు! మంచి బుద్ధిగలవారికి తోడ్పడతావు!

04. నీ శరీరం బంగారు వర్ణంలో ఉంటుంది. మంచి వేషధారణతో ఉంటావు! చెవులకు కుండలాలను ధరించావు! జుట్టును ముడివేసుకున్నావు.

05. ఒక చేతిలో వజ్రాయుధంలాంటి గదను ధరించావు. రెండవ చేతితో ధ్వజాన్ని ఎత్తిపట్టుకున్నావు. భుజం మీద జందెం ధరించావు.

06. నీవు శివుని అంశతో జన్మించావు! కేసరి నీ తండ్రి! గొప్ప తేజస్సు, ప్రకాశం కలిగినవాడివి. జగత్తు అంతా నీకు నమస్కరిస్తోంది!

07. విద్యావాన గుణీ అతిచాతుర
రామకాజకరివేకో ఆతుర
08. ప్రభుచరిత్ర సునివేకో రసియా
రామలఖన సీతా మన బసియా
09. సూక్ష్మరూపధరి సియ హి దిఖావా
వికటరూపధరి లంకజరావా
10. భీమరూపధరి అసురసంహారే
రామచంద్రకే కాజ సవారే
11. లాయ సజీవన లఖన జియాయే
శ్రీరఘువీర హరషి ఉరలాయే
12. రఘుపతి కీన్హీ బహుత బఢాయీ
తుమ మమ ప్రియభరత సమ భాయీ
13. సహసవదన తుమ్హారో యశగావై
అసకహి శ్రీపతికంఠ లగావై
14. సనకాదిక బ్రహ్మాది మునీశా
నారద శారద సహిత అహీశా
15. యమకుబేర దిక్పాల జహాఁతే
కవికోవిద కహి సకే కహాఁతే
16. తుమ ఉపకార సుగ్రీవహి కీన్హా
రామమిలాయ రాజపదదీన్హా
17. తుమ్హారో మంత్ర విభీషణ మానా
లంకేశ్వరభయ సబ జగ జానా
18. యుగసహస్ర యోజన పరభానూ
లీల్యోతాహి మధురఫలజానూ

07. నీవు గొప్ప విద్వాంసుడివి! సద్గుణ సంపన్నుడివి! మాట్లాడడంలోనూ, పనిచేయడంలోనూ గొప్ప నేర్పుకలవాడివి! శ్రీరాముడి పనిని నెరవేర్చడానికి ఆతుర పడుతూ ఉండేవాడివి!

08. శ్రీరాముడి కథను విని ఆనందిస్తావు! నీ మనస్సులో సీత, రాముడు, లక్ష్మణుడు నిండిపోయి ఉన్నారు.

09. సీతను పలకరించడానికి వెళ్ళినప్పుడు శరీరాన్ని చిన్నదిగా చేసుకొన్నావు. లంకను తగులబెట్టేటప్పుడు వికృతమైన రూపాన్ని ధరించావు.

10. రాక్షసులను సంహరించేటప్పుడు భయంకరమైన రూపాన్ని ధరించావు. రామకార్యాన్ని చక్కగా నెరవేర్చావు!

11. 12. సంజీవనీ పర్వతాన్ని ఊడబెరికి తెచ్చి లక్ష్మణుణ్ణి బ్రతికించావు. రాముడు ఎంతో సంతోషించి నిన్ను తన హృదయానికి హత్తుకున్నాడు. శ్రీరామచంద్రుడు నిన్ను గొప్పగా పొగిడి, “నీవు నాకు భరతుడితో సమానం!” అని చెప్పాడు.

13. నీ యశస్సును వేయినోళ్ళ కొనియాడి నిన్ను కౌగలించుకున్నాడు.

14. మరియు 15. సనకుడు మొదలైన మహర్షులు, బ్రహ్మ మొదలైన దేవతలు, మునీశ్వరులు, నారదుడు, సరస్వతి, ఆదిశేషుడు, యముడు, కుబేరుడు మొదలైన దిక్పాలకులు, కవులు, పండితులు ఎంతమందైనా నీ గొప్పతనాన్ని ఎంతవరకూ గానం చేయగలుగుతారు?

16. నీవు సుగ్రీవుడికి, రాముడికి స్నేహాన్ని కుదిర్చి, సుగ్రీవుడికి రాజ్యం లభించేలా చేసి అతడికి మహోపకారం చేశావు!

17. నీ సలహాను పాటించి విభీషణుడు లంకకే రాజు అయ్యాడు అన్నది జగమెరిగిన సత్యం.

18. రెండువేల యోజనాల దూరంలో ఉన్న సూర్యుణ్ణి చూసి అది ఒక పండు అనుకొని సులభంగా ఎగిరి అందుకున్నావు!

19. ప్రభుముద్రికా మేలిముఖమాహీ
జలధి లాంఘిగయే అచరజనాహీ
20. దుర్గమకాజ జగతకే జేతే
సుగమ అనుగ్రహా తుమ్హరే తేతే
21. రామదువారే తుమ రఖవారే
హోతన ఆఙ్ఞా బినుబైసారే
22. సబ సుఖలహై తుమ్హారీ శరనా
తుమ రక్షక కాహూకో డరనా
23. ఆపనతేజ సమ్హారో ఆపై
తీనోలోక హాంకతే కాంపై
24. భూతపిశాచ నికట నహి ఆవై
మహావీర జబ నామ సునావై
25. నాశై రోగ హరై సబ పీరా
జపత నిరంతర హనుమత వీరా
26. సంకటసే హనుమాన ఛుడావై
మన క్రమ వచన ధ్యానజోలావై
27. సబపరరామ తపస్వీరాజా
తినకేకాజ సకలతుమసాజా
28. ఔరమనోరథ జోకొయిలావై
తాసు అమిత జీవన ఫల పావై
29. చారోయుగ పరతాప తుమ్హారా
హై ప్రసిద్ధ జగత వుజియారా
30. సాధుసంతకే తుమరఖవారే
అసుర నికందన రామదులారే

19. అలాంటి నీవు రాముడి ముద్రికను తీసుకొని సముద్రాన్ని దాటితే అందులో ఆశ్చర్యపడవలసిన దేముంది?
20. నిన్నే ఆదర్శంగా భావించి పనిచేసేవారికి ఈ ప్రపంచంలో కష్టమైన పనులన్నీ సులభమైపోతాయి.
21. నువ్వు శ్రీరాముడి ద్వారపాలకుడివి. నీ అనుజ్ఞ లేకుండా ఎవ్వరూ లోపలికి వెళ్ళలేరు (రాముణ్ణి దర్శించలేరు).
22. నిన్ను శరణు కోరితే సమస్త సుఖాలూ లభిస్తాయి. నువ్వే మా రక్షకుడిగా ఉన్నప్పుడు ఇంక ఎవరికైనా ఎందుకు భయపడాలి?
23. నీలోవున్న గొప్ప తేజస్సును సంబాళించుకోగలిగిన వాడివి నీవే. నువ్వు ఒక్క కేక వేస్తే మూడులోకాలూ వణికిపోతాయి.
24. 25. ఓ మహావీరా! నీ పేరు వింటే చాలు, భూత, ప్రేత, పిశాచాలు పారిపోతాయి. నీ గురించి ఆలోచిస్తే అన్ని రోగాలూ తొలగిపోతాయి.
26. మనస్సుతో, మాటతో ఎవరు హనుమంతుడి గురించి క్రమం తప్పకుండా తీవ్రంగా ఆలోచించి, ధ్యానిస్తారో వారు నీలాగే తమ కష్టాలన్నింటినీ దాటగలుగుతారు.
27. రాముడు రాజులందరికీ తలమానికంలాంటి వాడు. తపస్సు చేసుకునే వారందరికీ ఆయనే ప్రభువు. రాముడి పనులన్నింటినీ నువ్వు చక్కగా నెరవేరుస్తూ ఉంటావు.
28. నిన్ను ధ్యానించే వారు దేనిని సాధించాలని సంకల్పించినా దానిని చక్కగా సాధించగలుగుతారు.
29. నాలుగు యుగాలలోనూ నీ ప్రతాపం నిలిచి ఉంటుందని అందరికీ తెలుసు. దానిచేత జగత్తు మరింత ఉజ్జ్వలమయ్యింది.
30. సాధువులను, మంచివారిని నీవు రక్షిస్తూ ఉంటావు. రాక్షసులను చంపడం ద్వారా రాముడికి ఇష్టమైనవాడివి అయ్యావు.

31. అష్టసిద్ధి నవనిధికే దాతా
అసవర దీన్హ జానకీ మాతా
32. రామరసాయన తుమ్హరే పాసా
సదారహో రఘుపతికే దాసా
33. తుమ్హరే భజన రామకో పావై
జన్మ జన్మకే దుఃఖబిసరావై
34. అంతకాల రఘుపతి పురజాయీ
జహాజన్మి హరిభక్తి కహాయీ
35. ఔర దేవతా చిత్తన ధరయీ
హనుమత సేయి సర్వసుఖ కరయీ
36. సంకట హటై మిటై సబపీరా
జోసుమిరై హనుమత బలవీరా
37. జైజైజై హనుమాన గొసాయీ
కృపాకరో గురుదేవ కిన్హాయీ
38. యహశతవార పాఠకర జోయీ
ఛూట హి బంది మహాసుఖహోయీ
39. జోయహపఢై హనుమాన చాలీసా
హోయసిద్ధి సాఖీ గౌరీసా
40. తులసీదాస సదా హరిచేరా
కీజైనాథ హృదయమహడేరా

దోహా - పవన తనయ సంకట హరణ
మంగళ మూరతి రూప
రామలఖన సీతా సహిత
హృదయ బసహు సురభూప్

31. ఎనిమిది సిద్ధులనూ, తొమ్మిది సంపదలనూ ఇవ్వగల శక్తిని జానకీమాత నీకు వరంగా ఇచ్చింది.
32. రామనామమనే తీయని రసం నీ దగ్గర ఉంది. నీవు రాముడి కోసం ఎంతో శ్రద్ధతో పనిచేసే దాసుడివి!
33. నిన్ను ప్రార్థిస్తే శ్రీరాముడు సంతోషపడతాడు. జన్మజన్మల దుఃఖాలూ తొలగిపోతాయి.
34. నిన్ను కొలిచేవారు ఎటువంటి జన్మను పొందినా, వారు హరిభక్తులనే పిలువబడతారు. తమ అంత్యకాలంలో శ్రీరాముని లోకానికి చేరుకుంటారు.
35. ఒకేసారి అనేకమంది దేవతల గురించి ఆలోచించకుండా ఎవరైతే హనుమంతుడి మీద మనస్సు నిలిపి తలచుకుంటారో వారికి సర్వసుఖాలూ కలుగుతాయి.
36. ఎవరైతే బలవంతుడు, మహావీరుడు అయిన హనుమంతుణ్ణి స్మరిస్తారో వారికి అన్ని విఘ్నాలూ తొలగిపోతాయి. వారి కష్టాలన్నీ నశిస్తాయి.
37. నా ప్రభువైన హనుమంతుడికి జేజేలు. శ్రీగురుదేవుల లాగానే నా మీద కృప చూపు స్వామీ!
38. ఎవరైతే ఈ హనుమాన్ చాలీసాను నూరుసార్లు చదువుతారో వారికి అన్ని బంధాలూ తొలగిపోయి సుఖాలు కలుగుతాయి.
39. ఈ హనుమాన్ చాలీసాను పఠించిన వారికి పార్వతీపరమేశ్వరుల సాక్షిగా తలపెట్టిన మంచిపనులు నిర్విఘ్నంగా నెరవేరతాయి.
40. తులసీదాసు (హనుమాన్ చాలీసాను రచించిన కవి) ఎల్లప్పుడూ రాముడికి దాసుడే. ఓ నాథా! నా హృదయంలో ఎల్లప్పుడూ నిలచి ఉండు!

దోహా – ఓ పవనతనయుడా! కష్టాలను తొలగించేవాడా! మంగళకరమైన రూపం కలవాడా! సీతారామ లక్ష్మణుల సమేతంగా నా హృదయంలో నివసించు!